సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



ఆర్టిజన్ల ఆందోళన

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టారు. IIలో



తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. IIలో

గరిష్టం / కనిష్టం
35° / 18°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రికి కొంత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

తొలిరోజు 'గేట్' ప్రశాంతం



హాల్ టికెట్లు తనిఖీ చేస్తున్న సిబ్బంది

సుజాతనగర్ : స్థానిక అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాలలో ఐఐటీ రూర్కీ ఆధ్వర్యంలో తొలిరోజు శనివారం జరిగిన గేట్–2025 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 98 మందికి గాను 92 మంది, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగిన రెండో సెషన్‌లో 109 మందికి గాను 98 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు సెషన్లలో కలిపి 17 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

క్షయ రహిత జిల్లాగా మార్చాలి

● డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

భద్రాచలంఅర్బన్ : భద్రాద్రిని క్షయ రహిత జిల్లాగా మార్చాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్ అన్నారు. దేశంలో టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల ముమ్మర కృషి కార్యక్రమం 'నిక్షయ్ శివర్' లో భాగంగా శనివారం భద్రాచలంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. సమావేశంలో క్షయ వ్యాధి నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కేంద్ర బృందం పరిశీలన



కొమరారం పీహెచ్‌సీ వద్ద కేంద్ర బృందం సభ్యులతో సిబ్బంది

ఇల్లెందురూరల్ : మండలంలోని రొంపేడు, కొమరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పాపులేషన్ రీసర్చ్ సెంటర్‌కు చెందిన కేంద్ర బృందం సభ్యులు శనివారం సందర్శించారు. పీహెచ్‌సీల్లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, రోజువారీ ఓపీ, ఇన్‌పేషెంట్ల వివరాలు, ఆస్పత్రుల పరిస్థితులు, అందుబాటులో ఉన్న సామగ్రి, మందులు, సిబ్బంది వంటి వివరాలపై ఆరా తీశారు. ఈ ప్రాంతంలో సాధారణంగా ఎలాంటి వ్యాధులు వస్తాయని అడిగి తెలుసుకున్నారు. కావాల్సిన సౌకర్యాలు, వసతులపై వైద్యుల నుంచి నివేదికలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెంఅర్బన్: శాసనమండలి ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తెలిపారు. శనివారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా నుంచి వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని 23 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,949 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 1,038 మంది, మహిళలు 911 మంది ఉన్నారని వివరించారు. ఎన్నికల కమిషన్ తుది జాబితా అనంతరం ఉపాధ్యాయ ఓటరు నమోదు దరఖాస్తులు 108 ఉన్నాయని, అందులో 47 ఆమోదించగా, 27 తిరస్కరణకు గురయ్యాయని, మరో 34 దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని పరిశీలించి సకాలంలో పంపిస్తామని చెప్పారు. వీసీలో జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, సీపీఓ సంజీవరావు, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్ పాల్గొన్నారు.

వేతనజీవులకు ఊరట..



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 – 26 బడ్జెట్ సింగరేణి ఉద్యోగులకు కలిసొచ్చింది. తమకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని సింగరేణి కార్మికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. అయితే ఈ అంశంపై ఇటు రాష్ట్రం, అటు కేంద్రం నుంచి హామీలే తప్ప అమలు జరగలేదు. కానీ తాజాగా మార్చిన ఇన్‌కం ట్యాక్స్ శ్లాబులతో సింగరేణి ఉద్యోగులు/కార్మికుల్లో చాలా మందికి ఆదాయపు పన్ను నుంచి ఊరట కలగనుంది.

సింగరేణి కార్మికులకు కలిసొచ్చిన కేంద్ర బడ్జెట్

- బొమ్మల తయారీ రంగానికీ ఊతం
- ముద్ర రుణాలతో పర్యాటకానికి మెరుగులు

మారిన శ్లాబుతో..

గతంలో వార్షిక వేతనం రూ.5 లక్షలు దాటితే 20 శాతం వరకు ఆదాయపు పన్ను చెల్లించాల్సి వచ్చేది. సింగరేణిలో ఒక కార్మికుడు ఉద్యోగంలో చేరినప్పుడు ప్రారంభ వేతనం సగటున రూ.40 వేల వరకు ఉంటుంది. 10 నుంచి 14 ఏళ్ల సర్వీసు పూర్తయ్యే సరికి వార్షిక వేతనం రూ.5 లక్షలు దాటి ఆదాయపు పన్ను పరిధిలోకి వెళ్లేవారు. సంస్థలో పని చేసే ఉద్యోగులు, కార్మికుల్లో సుమారు 60 శాతం మంది ఐటీ చెల్లించేవారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు ఆదాయపు పన్ను నుంచి రాయితీ పొందేందుకు హోం లోన్, ఆరోగ్య బీమా వంటివి చేయిస్తుంటారు. అయితే సింగరేణిలో కార్మికులకు క్వార్టర్లు, ఆస్పత్రి సౌకర్యం, రిఫరల్ కార్పొరేట్ హాస్పిటల్ ఫెసిలిటీ ఉండడంతో హోంలోన్లు, ఇన్సూరెన్స్ చేయించేవారు సాధారణంగా తక్కువగా ఉంటారు. దీంతో వారికి ఆదాయపు పన్ను అంశం ప్రధాన సమస్యల్లో ఒకటిగా మారింది.

వేల మందికి మేలు..

ప్రస్తుతం ఇన్‌కం ట్యాక్స్ శ్లాబ్‌ను రూ.12 లక్షల వరకు పెంచడంతో అనేక మంది కార్మికులు, ఉద్యోగులకు ఐటీ నుంచి మినహాయింపు లభించనుంది. లేదంటే గతంతో పోల్చితే తక్కువ పన్ను పడనుంది. జిల్లాలో ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, కార్పొరేట్ ఏరియాల్లో కలిసి 6,800 మంది వరకు సింగరేణి కార్మికులు ఉన్నారు. గతంలో ఐదు వేల మందికి పైగా కార్మికులు ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చేవారు. కానీ ప్రస్తుతం మారిన శ్లాబ్‌తో 2,500 మంది వరకు మాత్రమే ఐటీ చెల్లించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇతర ఉద్యోగులకూ ఉపశమనం

జిల్లాలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు మొత్తం 7,350 మంది ఉండగా ఇందులో సీనియర్లు అంతా ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చేవారే. ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌తో వీరిలో చాలా మందికి ఐటీ నుంచి ఊరట లభించనుంది. అలాగే చిన్న, మధ్య తరహా వ్యాపారాలు చేసే వారు కూడా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజా నిర్ణయంతో లబ్ధి పొందనున్నారు.

మార్కెట్‌లోకి 'భద్రాద్రి' బ్రాండ్..

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల విభాగంలో ఎస్సీ, ఎస్టీ, మహిళల్లో మొదటితరం ఔత్సాహికులకు రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. జిల్లాలో గిరిజన జనాభా ఎక్కువ. దమ్మపేట మండలం పూసుగూడెం, చంద్రుగొండ మండలం బెండాలపాడుతో పాటు భద్రాచలంలో వెదురుతో చేసిన బొమ్మలు, అలంకరణ వస్తువులు, ఫర్నిచర్ తయారీపై ఇటీవల దృష్టి సారించారు. ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రం ప్రతిపాదించిన రుణాలు కూడా మంజూరైతే కొయ్య, వెదురు బొమ్మల తయారీలో 'భద్రాద్రి' బ్రాండ్ మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది.

టూరిజంపై 'ముద్ర'..

ఎకో, టెంపుల్ టూరిజంలో జిల్లాకు అపార అవకాశాలున్నాయి. ఇప్పటికే భద్రాచలం పట్టణానికి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంది. అయితే భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెంలో పర్యాటకులు బస చేసేందుకు హోటళ్లు, లాడ్జీలే ప్రధాన దిక్కుగా ఉన్నాయి. ఇతర ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో ఉన్నట్టుగా ఇక్కడ హోం స్టే విధానం పెద్దగా ప్రాచుర్యంలోకి రాలేదు. అయితే తమ ఇంటిని హోం స్టేగా మార్చేందుకు ఆసక్తి ఉన్న వ్యక్తులకు ముద్ర లోన్లు అందజేస్తామని ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ముద్ర రుణాలు తీసుకుని తమ ఇంటిలోనే యాత్రీకులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లాలో వసతి సౌకర్యం మెరుగై ఆ మేరకు పర్యాటక రంగం పుంజుకునే అవకాశం ఉంటుంది.

కార్మికులకు మేలు



కేంద్ర బడ్జెట్‌తో రూ.12 లక్షల ఆదాయం ఉన్నవారికి ఐటీ నుంచి మినహాయింపు ఇవ్వడంతో సింగరేణి కార్మికులకు మేలు జరుగుతుంది. అయితే కొత్త గనులు, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం నిధులు కేటాయించకపోవడం బాధాకరం. తెలంగాణలోని అతి పెద్ద మైనింగ్ కాలేజీలో పాత కాలపు సాంకేతిక కోర్సులే ఉన్నాయి. వాటిని అప్‌గ్రేడ్ చేసేలా మైనింగ్ యూనివర్సిటీకి బడ్జెట్ కేటాయిస్తే బాగుండేది.

– ఎండీ రజాక్, ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు

విద్యా రంగానికి నిధుల్లో కోత



కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 2.53 శాతం మాత్రమే కేటాయించారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉన్నా నిధులు రాబట్టంలో పూర్తిగా విఫలమయ్యారు. పునర్విభజన చట్టంలో పొందుపరిచిన హామీల ప్రస్తావన లేదు. గిరిజన యూనివర్సిటీకి బడ్జెట్‌లో నిధులు శూన్యం. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారు.

– యెర్రా కామేష్, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉసూరుమనిపించారు..



కేంద్ర బడ్జెట్‌తో దేశ ప్రజలను అంకెల గారడీతో మాయ చేశారు. ఆశల పల్లకీలో ఊరేగించి చివరకు ఉసూరుమనిపించారు. బడ్జెట్ పెంచినప్పటికీ రూ.లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకే చూపడం దిగజారిన దేశ ఆర్థిక పరిస్థితికి నిదర్శనం. పేదరికం నుంచి 25 కోట్ల మందిని బయట తీసుకొస్తే ఆకలి సూచికలో ప్రపంచంలో 102వ స్థానం నుండి 107వ స్థానానికి దేశం ఎలా వెళ్లిందో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చెప్పాలి.

– నాగా సీతారాములు, టీపీసీసీ సభ్యుడు

సంపన్నులకే లబ్ధి



కొత్తగూడెంలో ప్రతిపాదనలో ఉన్న విమానాశ్రయ నిర్మాణానికి, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం జిల్లా ప్రజలను నిరాశకు గురిచేసింది. వ్యవసాయ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాలను పూర్తిగా విస్మరించారు. నిరుద్యోగులకూ నిరాశే ఎదురైంది. మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేటాయించే నిధుల్లో కోత విధించడం దారుణం. ఇది సంపన్నులు, కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాసే బడ్జెట్ మాత్రమే.

– ఎస్‌కే సాబిర్‌పాషా, సీపీఐ జిల్లా కార్యదర్శి

తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: విద్యార్థులు చదువు, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు తెలుగు భాషపై చిన్నతనం నుంచే మక్కువ పెంచుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం జరగగా, ముఖ్య అతిథిగా హాజరైన పీఓ మాట్లాడారు. విద్యార్థుల క్రమశిక్షణ, గతేడాది దాతల సహకారంతో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ చీఫ్ మేనేజర్ చెంగలరావు, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, ఎంఈఓ రమ, మాధవరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఆర్‌ఆర్‌బీ నోటిఫికేషన్ విడుదల చేసిన గ్రూప్– ఈ పోస్టులకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువత ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని పీఓ రాహుల్ సూచించారు. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250 చెల్లించాలని, పదో తరగతి లేదా ఐటీఐ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 7729961197 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

40 మంది బాల కార్మికులకు విముక్తి

● ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడి

కొత్తగూడెంటౌన్: జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంతో జిల్లాలో 40 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఐదు బృందాలుగా ఏర్పడి కార్యక్రమాన్ని విజయవంతం చేశామని పేర్కొన్నారు. గుర్తించిన 40 మంది బాల కార్మికుల్లో 33 మంది బాలురు, ఏడుగురు బాలికలు ఉన్నారని తెలిపారు. జిల్లాలోని ఆయా ప్రదేశాల్లో పిల్లలను పనిలో పెట్టుకున్న 27 మంది యజమానులపై కేసులు నమోదు చేసినట్లు వివరించా రు. బాల కార్మికులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన అధికా రులను అభినందించారు. ఎవరైనా బాల కార్మికులను గుర్తిస్తే డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

గిరిజన కళలను రక్షించుకుందాం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈఓ, పక్కన అధికారులు



గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థులు

టేకులపల్లి: ప్రస్తుత ఆధునిక యుగంలో గిరిజన ప్రాచీన కళలు, సంస్కృతి, సంప్రదాయాలు అంతరించిపోకుండా రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కల్చరల్ మీట్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గిరిజన సంప్రదాయాలపై విద్యార్థులు వేసిన చిత్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ, గిరిజనుల కళలు, సంప్రదాయాలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ క్రమంలోనే భద్రాద్రి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఒక్కో పాఠశాల చొప్పున ఎంపిక చేసి కల్చరల్ మీట్ నిర్వహిస్తోందని, జిల్లాలో టేకులపల్లి పాఠశాల ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. టేకులపల్లి విద్యార్థుల కళాత్మక నైపుణ్యం అభినందనీయమని, చదువుతో పాటు ఆట పాటల్లో ముందున్నారని ప్రశంసించారు. కల్చరల్ మీట్‌ను విజయవంతం చేసిన హెచ్‌ఎం మెరుగు శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ జగన్, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు నాగ రాజశేఖర్, సతీష్, సైదులు, అన్నామణి పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికి పెద్దపీట

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలోని కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, యూనియన్ ఐటీసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్ అన్నారు. సారపాకలోని సంఘం కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ యూనియన్‌ను గెలిపించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. 14వ వేతన ఒప్పందంలో మెరుగైన ప్యాకేజీని అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కార్మికులతో పాటు వారి కుటుంబసభ్యులకు కూడా విద్య, వైద్య పరంగా వసతులు కల్పిస్తామన్నారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని ప్రకటించారు. పర్మనెంట్ కార్మికుల ప్రయోజనాలతో పాటు బదిలీ, కాంట్రాక్ట్ కార్మికుల ప్రయోజనాలనూ పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమ విస్తరణ, ఉద్యోగ, ఉపాధి కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు గల్లా నాగభూషయ్య, గాదె రామకోటిరెడ్డి, వి.రత్నాకర్, బి.భాస్కర్, డి.శేషిరెడ్డి, సీహెచ్ మహేశ్వరరావు, కె.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గోదావరి మాతకు హారతి సమర్పిస్తున్న అర్చకులు, ఈఓ

రామదాసుకు స్వరాంజలి..

వైభవంగా ప్రారంభమైన జయంత్యుత్సవాలు



చిత్రకూట మండపంలో వేదికపై స్వామివారు, పక్కన రామదాసు విగ్రహం

భద్రాచలం: 'తక్కువేమి మనకు.. రాముండొక్కడుండు వరకు.. అదిగో భద్రాద్రి.. గౌతమి ఇదిగో చూడండి.. పలుకే బంగారమాయెనా.. కోదండపాణి' అంటూ భక్త రామదాసు కీర్తనల స్వరార్చనలతో భద్రగిరి పులకించిపోయింది. వివిధ రాష్ట్రాలు, పట్టణాల నుంచి వచ్చిన పలువురు సంగీత కళాకారులు భక్తి పారవశ్యంతో రామయ్యతో పాటు రామదాసుకు స్వరాంజలి సమర్పించారు. దీంతో భద్రాచలంలో సంగీత, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీరాముడి పరమ భక్తాగ్రేసరుడు, వాగ్గేయకారుడు, భద్రాచలం రామాలయ నిర్మాత రామదాసు 392వ జయంతి ఉత్సవాలు శనివారం ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. రామాలయం, చక్ర సిమెంట్స్ వారి నేండ్రగంటి అలివేలుమంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తొలి రోజు సంగీత మధురిమలు వీనులవిందుగా సాగాయి.

నగర సంకీర్తనతో ప్రారంభం..

భక్త రామదాసు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రామదాసు ప్రతిమతో ఆలయ ఈఓ రమాదేవి ఆధ్వర్యంలో నగర సంకీర్తన చేశారు. ఉత్తర ద్వారం వద్ద గల రామదాసు విగ్రహానికి పూలమాలలు వేశారు. భద్రగిరి ప్రదక్షిణ అనంతరం పవిత్ర గోదావరి మాతకు పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పించారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలోని రామదాసు విగ్రహానికి పంచామృతాభిషేకం చేసి, పట్టు వస్త్రాలు అలంకరించారు. నైవేద్యం, హారతి సమర్పించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీ సేవగా తీసుకొచ్చి చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు.

సంగీత కళాకారుల స్వరార్చన..

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు 'నవరత్న ఘోష్టి'తో స్వర నీరాజనం ప్రారంభించారు. అనంతరం ప్రఖ్యాత సంగీత విద్వాంసులు మల్లాది సోదరులు, పలువురు గాయనీ గాయకులు ఆలపించిన కీర్తనలు, భక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చక్ర సిమెంట్స్ అధినేత నేండ్రగంటి కృష్ణమోహన్, ఆలయ ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, ప్రధానార్చకులు పొడిచేటి విజయరాఘవన్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



జూలూరుపాడు : మాట్లాడుతున్న న్యాయమూర్తి భానుమతి

సుజాతనగర్/జూలూరుపాడు: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.భానుమతి అన్నారు. సుజాతనగర్ మండలం వేపలగడ్డ, జూలూరుపాడు మండలం పడమటనర్సాపురంలోని హాస్టళ్లు, పాఠశాలలను శనివారం ఆమె సందర్శించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతోందా అని ఆరా తీశారు. హాస్టల్, పాఠశాల ఆవరణల్లో పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రాథమిక హక్కులైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్య వంటివి సరిగా అందేలా చూడాలని సూచించారు. కాలం ఎంతో విలువైనదని, విద్యార్థులు పట్టుదల, సమయస్ఫూర్తితో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించే ఆత్మస్థైర్యం అందరిలోనూ ఉంటుందన్నారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలని, తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది మెండు రాజమల్లు, ప్రిన్సిపాల్ బ్యూలారాణి, ఏజీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సుభద్ర, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వార్డెన్ తార తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో కొత్త ఉత్తేజం, ఉత్సాహం



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా, వేదికపై ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా
- ఖమ్మంలో మహిళా న్యాయవాదుల క్రీడాపోటీలు ప్రారంభం



త్రోబాల్ సర్వీస్ చేస్తున్న జస్టిస్ నందా

ఖమ్మంలీగల్: అటు కేసులు, ఇటు కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమయ్యే మహిళా న్యాయవాదులు క్రీడలపై దృష్టి సారించి పోటీల్లో పాల్గొనడం ద్వారా కొత్త ఉత్తేజం, ఉత్సాహం సమకూరుతాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా పేర్కొన్నారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో తాళ్లూరి సాహస్ చౌదరి మెమోరియల్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మహిళా న్యాయవాదుల క్రీడాపోటీలను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు, వినోదాలు మానవ జీవితానికి అవసరమని, క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తాయని తెలిపారు. అంతేకాక ఆటలతో సృజనాత్మక, నైపుణ్యం వెలుగులోకి వస్తాయని, మానవ సంబంధాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మూడేళ్లుగా మహిళా న్యాయవాదులకు రాష్ట్ర స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్న న్యాయవాది తాళ్లూరి దిలీప్‌ను అభినందించారు. అనంతరం ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ మాట్లాడగా జస్టిస్ నందా మహిళా న్యాయవాదులతో కలిసి సరదాగా కబడ్డీ, రింగ్, త్రోబాల్ ఆడి ఉత్సాహపరిచారు. కాగా, క్రీడాకారులకు ఇటీవల మృతిచెందిన న్యాయవాది చల్లా శంకర్ జ్ఞాపకార్థం టీ షర్ట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, ఎం.అర్చనాకుమారి, శ్రీనయ్య, బి.రాంప్రసాదరావు, కే.వీ.చంద్రశేఖరరావు, ఎం.కల్పన, కాసరగడ్డ దీప, బిక్కం రజని, బిందుప్రియ, శివరంజని, వినుకొండ మాధవి, బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ, ఫెడరేషన్ ఆఫ్ బార్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ కమిటీ ఎన్నిక


యాకుబ్‌షావలి


తోకల రమేష్

ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) అనుబంధ ప్రగతిశీల సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా యాకుబ్‌షావలి, ప్రధాన కార్యదర్శిగా తోకల రమేష్, గౌరవాధ్యక్షుడిగా గుమ్మడి నర్సయ్య ఎన్నికయ్యారు. ఇల్లెందులో జరిగిన మహాసభలో రాష్ట్ర కమిటీని ప్రకటించారు. సంఘం ఉపాధ్యక్షుడి ఆర్. మధుసూదన్‌రెడ్డి(మణుగూరు), సహాయ కార్యదర్శిగా పెద్దబోయిన సతీష్(కొత్తగూడెం), కోశాధికారిగా సీవై పుల్లయ్య(సత్తుపల్లి), ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పాయం వెంకన్న(ఇల్లెందు), శరత్(సత్తుపల్లి), కార్యవర్గ సభ్యులుగా మరికొందరిని ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలు ప్రకటించారు.

మంగాయమ్మ మృతికి ఎమ్మెల్యేల నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజు

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన, హైదరాబాద్ ఏసీపీ విష్ణుమూర్తి తల్లి మంగాయమ్మ మృతికి పలువురు సంతాపం తెలిపారు. మృతదేహాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తదితరులు సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, నర్వేనేని పుల్లారావు, వేల్పుల నరసింహారావు, చౌడం నరసింహారావు, మోదుగు రామకృష్ణ, పోతురాజు నాగరాజు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ ఉన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, డిప్యూటీ డెమో మహ్మద్ ఫైజ్ మోహీనుద్దీన్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఎఫ్ ఫాంపై ఆడిట్ నిర్వహించామని, ఆస్పత్రి నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్న రిజిస్టర్లను పరిశీలించామని తెలిపారు. అర్హత కలిగిన వైద్యులే చికిత్స అందించాలని, అనుమతులు లేని ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

తలసేమియా బాధితులకు రక్తదానం

పాల్వంచ: తలసేమియా బాధితులకు టీజీ జెన్‌కో ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. శనివారం ఎస్టీ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కేటీపీఎస్ 5,6,7 దశల చీఫ్ ఇంజనీర్లు ఎం.ప్రభాకర్ రావు, శ్రీనివాసబాబు ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోస్తుందని అన్నారు. అనంతరం రక్తదాతలకు జ్యూస్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ సూరినారాయణ, అసోసియేషన్ జెన్‌కో ప్రెసిడెంట్ రాందాస్, జనరల్ సెక్రటరీ మాలోతు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ బానోతు ప్రవీణ్, మంగీలాల్, దుర్గా ప్రసాద్, బన్సీలాల్, కేశులాల్, భద్రు, బిచ్చు, రాజేష్, మోయిలాల్, రామకృష్ణ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో మోకాలి చిప్ప మార్పిడి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో శనివారం మోకాలి చిప్ప మార్పిడి శస్త్రచికిత్స చేశారు. ఆస్పత్రి సీఎంఓ సుజాత నేతృత్వంలో వైద్యులు విక్రమ్, రేష్మా, సువర్ణరేఖ మోకాలు మార్పిడి ఆపరేషన్ విజయవంతం నిర్వహించారు. ఈ కేసును హైదరాబాద్‌కు రిఫర్ చేస్తే రూ. 2 లక్షలు ఖర్చయ్యేదని, ఆ మేరకు సంస్థకు ఆదాయం మిగిలిందని వైద్యులు తెలిపారు. డాక్టర్లు రవళి, నాగరాజు, సిబ్బంది శస్త్రచికిత్సకు సహకరించారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా వెంకటేశ్వరావు

కొత్తగూడెంటౌన్: జిల్లా లీగల్ సెల్ చైర్మన్‌గా కొత్తగూడేనికి చెందిన సీనియర్ న్యాయవాది వెల్లంకి వెంకటేశ్వరావు నియమితులయ్యారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్‌ను బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం న్యాయవాదులు అశోక్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, నాయకులు అల్లాడి నర్సింహారావు, జేబీ శౌరీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఆకుల సత్యనారాయణమూర్తి, వీవీ సుధాకర్‌రావు, విజయ్‌కుమార్, మారపాక రమేష్, గడిపల్లి మహేష్ పాల్గొన్నారు.

ఆర్టిజన్ల ఆందోళన


కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఆర్టిజన్లు (ఫైల్)

- విద్యుత్ సంస్థల కార్మికులను కన్వర్షన్ చేయాలని నిరసనలు
- ఇప్పటికే ఉన్నతాధికారుల కార్యాలయాల ఎదుట రిలేదీక్షలు
- రేపటి నుంచి జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త యాత్ర

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. వీరిని అటు కాంట్రాక్ట్ కార్మికులుగా, ఇటు ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడంలేదు. 2018లో సుమారు 23 వేల మందిని ఏక కాలంలో కాంట్రాక్ట్ కార్మికులందరినీ ఆర్టిజన్లుగా తీసుకున్నారు. వీరంతా రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం సంస్థల్లో పనిచేస్తుండగా, స్కిల్‌ను బట్టి వేతనాలు నిర్ధారించారు. ఎనిమిదేళ్లుగా వారికి పదోన్నతులు, ఇంక్రిమెంట్‌లు ఇవ్వడంలేదు. వసతులు కూడా కల్పించడంలేదు. ఈ నేపథ్యంలో తమను కన్వర్షన్ చేసి పర్మనెంట్ చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచీ ఆర్టిజన్లు కోరుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా స్పందించకపోవడంతో ఆందోళన బాట పట్టారు. తెలంగాణా విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్–జేఏసీగా ఏర్పడి అన్ని సెక్లార్లలో పనిచేసే కార్మికులంతా నిరసనలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోని ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ జిల్లా కార్యాలయాలు, కేటీపీఎస్, బీటీపీఎస్ కర్మాగారాల సీఈ, ఎస్ఈ ఆఫీసుల ఎదుట ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. గత నెల 20వ తేదీ నుంచి 24 వరకు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కన్వర్షన్ యాత్ర చేపట్టనున్నారు. 20న చలో విద్యుత్ సౌధకు పిలుపునిచ్చారు. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 4 వేల మంది ఆర్టిజన్లు పనిచేస్తున్నారు.

సర్వీస్ రూల్స్ మార్చాలి

స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రతీ ఆర్టిజన్‌కి ఇంక్రిమెంట్, గ్రేడ్ ప్రమోషన్ ఇవ్వాలి. గ్రేడ్ చేంజ్ ఇంక్రిమెంట్‌లతో సహా 16 నెలల ఎరియర్స్ కూడా ఇవ్వాల్సి ఉంది. కానీ యాజమాన్యాలు అమలు చేయడంలేదు. ఈ క్రమంలో స్టాండింగ్ ఆర్డర్లను రద్దు చేసి టీ టఫ్‌తో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం కార్మికులందరినీ కన్వర్షన్ (విలీనం) చేసుకోవాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. కన్వర్షన్ చేసినా సంస్థపై ఎలాంటి ఆర్థిక భారం పడదని నాయకులు పేర్కొంటున్నారు. 2022 పీఆర్సీ ప్రకారం విద్యార్హతలను బట్టి జేఎల్ఎం, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇవ్వాలని కోరుతున్నారు. విద్యుత్ సంస్థల్లో మొత్తం 55 వేల మంది ఉద్యోగులుంటే వారిలో 23వేల మంది ఆర్టిజన్‌లే ఉన్నారు. ప్రభుత్వానికి పేరు తెచ్చిన రైతులకు ఉచిత విద్యుత్, గృహజ్యోతి పథకాల అమలులో తమ పాత్ర కూడా ఉందని, ఒకే సంస్థలో రెండు రకాలుగా ఉన్న సర్వీస్ రూల్స్‌ను మార్చాలని ఆర్టిజన్లు పేర్కొంటున్నారు.

పోరాటాలు ఉధృతం చేస్తాం



విద్యుత్ సంస్థల్లోని ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి. ఇప్పటికే డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఎనర్జీ సెక్రటరీ, సీఎండీలకు వినతిపత్రాలు అందించాం. 307 జీఓ వర్తింపజేయాలి. రాష్ట్రవ్యాప్త ఆందోళనలు ఉధృతం చేస్తాం. అవసరమైతే సమ్మెకు కూడా దిగుతాం.

– ఎం.ఏ.వజీర్, టీవీఏసీ రాష్ట్ర కన్వీనర్

మాకు న్యాయం చేయాలి



విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్ కార్మికుల విధులు ఎంతో కీలకమైనవి. కన్వర్షన్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. అటు సంస్థలో ఉద్యోగులం కాకుండా స్కిల్‌కు తగ్గ వేతనాలు లేక, సరైన వసతులు లేకుండా పోయాయి. మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– బానోతు శంకర్, టీవీఏసీ రాష్ట్ర కో చైర్మన్

ఇద్దరు మావోయిస్టులు లొంగుబాటు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ సభ్యుడు మడవి ఉంగ, ఏటీబీ కట్ ఆఫ్ ఏరియా కమిటీ సభ్యురాలు మడకం సుక్కిలు శనివారం జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఎస్పీ రోహిత్‌రాజు కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడు గ్రామ పంచాయతీ పాలగూడెం గ్రామానికి చెందిన మడవి ఉంగ అలియాస్ నగేష్ కలిమెల ఏరియా కమిటీ ఏసీఎంగా పనిచేస్తున్నాడు. బీజాపూర్ జిల్లా టర్రాం పీఎస్ పరిధికి చెందిన మడకం సుక్కి అలియాస్ రోషిణి కట్ ఆఫ్ ఏరియా కమిటీ సభ్యురాలుగా పనిచేస్తోంది. మడవి ఉంగ 2015 నుంచి మావోయిస్టు పార్టీలో వివిధ స్థాయిలో పనిచేస్తున్నాడు. 2018లో మావోయిస్టుల్లో చేరిన మడకం సుక్కి, అలియాస్ రోషిణి 2021 నుంచి ఏటీబీ కట్ ఆఫ్ ఏరియా కమిటీలో పని చేస్తోంది. వీరిద్దరూ పలు విధ్వంసకర సంఘటనల్లో పాల్గొనగా, ఉంగపై రూ.4 లక్షల రివార్డు ఉందని ఎస్పీ తెలిపారు. సాధారణ జీవితం గడపాలనుకునే మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఎస్పీ కోరారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ పరితోష్ పంకజ్, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుడికి సన్మానం


కాంట్రాక్ట్ ఉద్యోగి సాంబయ్యను సన్మానిస్తున్న డీజీఎం, తోటి కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): ఉద్యోగ విరమణ పొందిన కాంట్రాక్ట్ కార్మికుడిని శనివారం సింగరేణి అధికారులు సన్మానించారు. కార్మికుడు పి.సాంబయ్య కార్పొరేట్ సివిక్ విభాగంలో 20 ఏళ్లు పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. కొత్తగూడెం కార్పొరేట్ డీజీఎం రాజశేఖర్ తదతరులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అధికారులు, కాంట్రాక్టర్లు, నాయకులు సాంబశివరావు, ఖాజా, రమేష్, బంగారి లక్ష్మణ్, ఎస్ కే గౌస్‌పాష, సంజీవ్, నాగలక్ష్మి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మహిళా ఉద్యోగి మృతి

- విధులకు వస్తుండగా ఘటన
- నేత్రదానం చేసిన కుటుంబీకులు

గతంలోనే భర్త, కుమారుడు మృతి


అనురాధ (ఫైల్)

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనురాధ(50) గుండెపోటుతో మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు. పదిరోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆమె విధులకు హాజరయ్యేందుకు శనివారం తన కుమార్తెను తోడుగా తీసుకుని కొత్తగూడెం నుంచి బూర్గంపాడుకు బస్సులో వచ్చింది. బస్సు దిగాక నీరసంగా ఉండటంతో బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే స్పృహ కోల్పోగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భద్రాచలానికి, అనంతరం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు. కొత్తగూడెంలో నివాసముంటున్న అనురాధ బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2021 నుంచి రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పదేళ్ల క్రితం ఆమె భర్త చనిపోయాడు. మూడేళ్ల క్రితం కరోనాతో కుమారుడు మృతిచెందాడు. దీంతో కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తోంది. ఆమె కూడా మృతి చెందడంతో కుమార్తె కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఇంతటి విషాదంలోనూ కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. అనురాధ మృతిపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రవిలా దేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతురాలి కుమార్తెను ఓదార్చి ధైర్యం చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


భరత్‌కుమార్(ఫైల్)

దమ్మపేట : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని కొడిసెలగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి భరత్ కుమార్ (30) శుక్రవారం బైక్‌పై సత్తుపల్లి వెళ్లి, రాత్రి వేళలో తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో గండుగులపల్లి శివారులోని ముత్యాలమ్మ ఆలయ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడింది. దీంతో భరత్ కుమార్ రోడ్డు పక్కన పొదల్లో పడిపోయాడు. తీవ్రగాయాలై రక్తస్రావం జరిగింది. గమనించిన ప్రయాణికులు క్షతగాత్రుడిని దమ్మపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్య సిబ్బంది అప్పటికే మృతి చెందాడని తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య తిరుపతమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భరత్ కుమార్ మృతితో కొడిసెలగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పామాయిల్ గెలల కోతకు వెళ్లి..

చెట్టు పైనుంచి పడి ఒకరు మృతి


మృతుడు రాంబాబు

దమ్మపేట : పామాయిల్ గెలలు కోసేందుకు వెళ్లిన వ్యక్తి చెట్టు పైనుంచి పడి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... జమేదారు బంజర గ్రామానికి చెందిన మొడియం రాంబాబు(40) గోపాలపురం శివారులోని పామాయిల్ తోటలో గెలలు కోసేందుకు కూలి పనికి వెళ్లాడు. మోకు సహాయంతో చెట్టు ఎక్కి గెలలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో గాయాలయ్యాయి. తోటి కూలీలు తక్షణమే దమ్మపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కాగా మృతుడి భార్య గతంలోనే చనిపోయింది. ఇద్దరు కుమారులు ఉన్నారు.

'నర్సింగ్'లో 100 శాతం ఫలితాలు

భద్రాచలంఅర్బన్: ఐటీడీఏ ప్రాంగణంలోని మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ ట్రైనింగ్ (నర్సింగ్) స్కూల్లో నూరుశాతం ఫలితాలు నమోదయ్యాయి. మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో 59 మందికి 59 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ చైతన్య తెలిపారు.

మొలకెత్తని మొక్కజొన్న విత్తనాలు

విక్రయించిన సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌పై కేసు నమోదు


చంద్రుతండా పంచాయతీలో విచారణ చేపడుతున్న అధికారులు

టేకులపల్లి: మొక్కజొన్న విత్తన విక్రేతలపై టేకులపల్లి పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్ కథనం ప్రకారం.. టేకులపల్లికి చెందిన, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, చంద్రుతండాకు చెందిన భూక్య రాజా తదితరులు పలు మొక్కజొన్న కంపెనీల విత్తనాలను చంద్రుతండా, గోప్యాతండా, సూర్యాతండా గ్రామాల్లో పలువురు రైతులకు అందజేశారు. సాగు ఖర్చులు ఇస్తామని, పంట వచ్చినా, రాకపోయినా ఎకరాకు రూ.60 వేలు ఇస్తామని నమ్మబలికారు. దీంతో రైతులు సాగు చేయగా మొలకలు రాలేదు. కొన్ని మొలకెత్తినా మొక్కలు చనిపోయాయి. ముందుగా చెప్పినట్లు రూ.60 వేలు ఇవ్వాలని రైతులు అడిగితే విత్తనాలు అందించిన లక్కినేని సురేందర్‌రావు స్పందించలేదు. దీంతో రైతులు ఫిర్యాదు చేయగా, సీఐ సురేష్, ఎస్ఐ శ్రీకాంత్, ఏఓ అన్నపూర్ణ మొక్కజొన్న చేన్లను పరిశీలించారు. లేబుళ్లు, కంపెనీ పేర్లు, లైసెన్సు వివరాలు లేకపోవడంతో విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా లక్కినేని సురేందర్‌రావు, భూక్య రాజాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. విత్తన కంపెనీలతో అగ్రిమెంట్ లేకుండా సాగు చేస్తే నష్టం జరుగుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ అన్నపూర్ణ సూచించారు. ఈ ఘటనపై లక్కినేని సురేందర్‌రావును వివరణ కోరగా.. కొన్ని గ్రామాల్లో చేలు మంచిగానే ఉన్నాయని, రాజకీయ కుట్రలో భాగంగానే తనపై బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

బొగ్గు టిప్పర్ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు


రోడ్డుపై బోల్తా పడిన టిప్పర్

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు టిప్పర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన శనివా రం రుద్రంపూర్‌లో జరిగింది. కొత్తగూడెం టూ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సత్తుపల్లి నుంచి నవభారత్‌కు అతివేగంతో వెళ్తున్న బొగ్గు టిప్పర్ రుద్రంపూర్‌లోని ప్రగతివనం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై అదుపు తప్పి పక్కనే ఉన్న ఆటోపై పడింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. పక్కనే ఉన్న ద్విచక్రవాహనం పాక్షికంగా దెబ్బతింది. టిప్పర్ బోల్తా పడగా, బొగ్గు పెళ్లలు చెల్లా చెదురుగా పడటంతో వాహనదారులకు కూడా గాయాలయ్యాయి. ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ జాఫర్‌కు గాయాలయ్యాయి. సింగరేణి సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు, పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని టిప్పర్‌ను రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాగా ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా నేషనల్ హైవేస్ అధికారులు నివారణ చర్యలు తీసుకోవడంలేదంటూ స్థానిక నాయకులు తోట రాజు, తొల్ల శ్రీనివాస్, బండారు సాగర్, రజాక్ తోపాటు ఉమర్, రంజిత్, లక్ష్మణ్, సంపత్, తరుణ్ తదితరులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. సీఐలు శివప్రసాద్, కరుణాకర్, ఎస్ఐ శ్రీనివాస్, సింగరేణి సెక్యూరిటీ అధికారులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

అంగన్‌వాడీల్లో కాలం చెల్లిన పాల ప్యాకెట్లు


లబ్ధిదారులకు పంపిణీ చేసిన కాలం చెల్లిన పాల ప్యాకెట్లు

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక పంచాయతీ రామకృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు, పిల్లలకు కాలం చెల్లిన పాలు పంపిణీ చేశారు. నవంబర్ 2024తో గడువు ముగిసిన పాల ప్యాకెట్లను లబ్ధిదారులకు అందచేశారు. ఈ విషయాన్ని ఓ లబ్ధిదారు అంగన్‌వాడీ టీచర్ దృష్టికి తీసుకురాగా, పాలను వినియోగించొద్దని సూచించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. కాగా, దీనిపై ఓ అధికారిని వివరణ కోరగా.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భార్యను హతమార్చిన భర్త


జయ మృతదేహం

దుమ్ముగూడెం : మండలంలోని పర్ణశాల పంచాయతీ పరిధి గోవిందాపురం గ్రామానికి చెందిన తాటి జయను ఆమె భర్త నరసింహారావు కత్తితో పొడిచి హత్య చేశాడు. సీఐ అశోక్ కథనం ప్రకారం.. గోవిందాపురం గ్రామానికి చెందిన తాటి నరసింహారావు, జయను 14 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కత్తితో దాడి చేయగా జయకు గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి తల్లి కుంజ కన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శనివారం తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

అదనపు కలెక్టర్ విద్యాచందన


నర్సరీలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

గుండాల: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ విద్యాచందన సూచించారు. మండలంలో శనివారం ఆమె పర్యటించారు. మామకన్ను, గుండాల విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాట్లపై స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుతో వ్యవసాయ రంగానికి సాగునీటి కొరత ఉండదని అన్నారు. ప్రతీ గ్రామంలో తాగునీటి కొరత లేకుండా చూడాలని కార్యదర్శులను సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పెంచుతున్న నర్సరీలను పరిశీలించారు. ఎమ్మెల్సీ ప్రవర్తనా నియమావళిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఎం నాగేశ్వారావు, ఏపీఓ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రే పునరుద్ధరించారు..

- 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ
- తీగలు తెగి 30 గ్రామాలకు నిలిచిన సరఫరా
- తక్షణమే మరమ్మతులు చేపట్టిన అధికారులు, సిబ్బంది


అర్ధరాత్రి వేళ కొత్త స్తంభం ఏర్పాటు చేసి, వైర్లు బిగిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: అర్ధరాత్రి వేళలో ఓ లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో మూడు సబ్ స్టేషన్లు, మరో మూడొందలకు పైగా గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది తక్షణమే అప్రమత్తమై విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండలంలోని తిమ్మాపురం గ్రామం వద్ద ప్రధాన రహదారి పక్కనే ఉన్న 33కేవీ విద్యుత్ స్తంభాన్ని అటుగా వస్తున్న ఓ లారీ శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అదుపు తప్పి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. కానీ సబ్ స్టేషన్‌కు వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్ ఉన్న కరెంట్ స్తంభం విరిగి వైర్లు తెగిపోవడంతో వినాయకపురం, నారాయణపురం, గంగారం విద్యుత్ సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న 30 గిరిజన గ్రామాలకు సైతం విద్యుత్ సరఫరా ఆగిపోయింది. పల్లెల్లో అంధకారం నెలకొంది. దీంతో ట్రాన్స్‌కో డీఈఈ నందయ్య, ఏడీఈ వెంకటరత్నం, ఏఈఈ సంతోష్‌తోపాటు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అర్ధరాత్రి వేళలో దాదాపు మూడు గంటలపాటు శ్రమించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. తెగిన వైర్లకు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ సేవలను నిర్లక్ష్యం చేయకుండా గంటల వ్యవధిలోనే పరిష్కరించడం పట్ల వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో సీఎండీ ఫోన్ ద్వారా స్థానిక సిబ్బందిని అభినందించారు.



సాక్షి సండే క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ మేము మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నాము. అలాగే ఏజెంట్లను కూడా ఆహ్వానిస్తున్నాము.9092692403 [IA-0152]

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

Real Estate

TO-LET

■ ఖమ్మం, శ్రీనగర్ కాలనీ, రోడ్ నెం. 11, మెయిన్ రోడ్ ఫేసింగ్ 5 అంతస్థుల బిల్డింగ్ 8800 Sft. విడిగా/మొత్తంగా కమర్షియల్స్‌కు అద్దె/లీజుకు కలదు. 7382664450, వాట్సాప్ : 01954 3190600 [M-1256041]

Wanted

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1268551]

■ Sri Subramanyeswara Stone Crushers Supervisors Wanted, Salary Starts: 16,000/-. Qlf:12th Pass, Cont: 9515143989 [OA-382]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91332 71122, 95534 61177 [B-1266958]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843 [B-1266955]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639662 / 8977639663 [SCA25001467]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ Hyd & Vja బ్రాంచీలకు 10th ఆపై చదివిన 20-50 సం॥ స్త్రీ/పు టెలికాలర్స్, క॥కేర్, సూ॥వైజర్లు, అడ్మిన్లు, మేనేజర్లు, అకౌంటెంట్లు, బైక మెకానిక్‌లు కా॥. భో+వ+జీ 20-30 వేలు. 9491651122, 9491821122 [SCA25001390]

■ సైట్ అకౌంటెంట్స్ మరియు లైసిన్ ఆఫీసర్స్ కావలెను. సంస్థ పేరు: PVC ప్రాజెక్ట్స్, హైదరాబాద్. కాల్: మొబైల్ : 040 23338080, adm.vineela@gmail.com. ఇంటర్వ్యూ సమయం: Tuesday - Thursday 10 am - 1 pm [H-804889]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.





కేలా రెనెకి
నికీ ప్రసాద్

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్-19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారీ భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అభేద్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తే లేదు!

నేడు మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు

- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కెలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కె (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాన్ని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకి కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబో మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు

ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4-1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్-4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌ల తోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్

- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



2-3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2-0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6-2, 6-1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-0, 6-2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా




• 'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది

-'దిల్' రాజు

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ-''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్, కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ- ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.



• 'తంగలాన్'లో విక్రమ్



• 'గామి'లో విశ్వక్ సేన్

అరుదైన గౌరవం

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్



• కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమేరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.

స్క్రీన్స్ పెరగడం ఆనందం

- విష్ణువర్ధన్

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ-''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.



• విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

సస్పెన్స్

రాంప్రసాద్, జెమినీ సురేశ్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ-''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.



• ఆర్పీ పట్నాయక్, సురేశ్

సూర్యాపేట్ నేపథ్యంలో....

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ- ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.



• ఈశ్వర్, నైనా

ఓటీటీ
ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండి తెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

- ఇంటూరు హరికృష్ణ